ఏపీలో కుల గణన.. బీసీ కులాల అభ్యున్నతికి దోహదం

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



మారేశ్‌ను సత్కరిస్తున్న రాజ్యసభ్య సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్‌ను బీసీ కమిషన్ సభ్యులుగా నియమించిన ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. బీసీ కమిషన్ మెంబర్‌గా నియమితులైన డాక్టర్ ఎస్.మారేష్‌ను శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో పలు బీసీ సంఘాల ప్రతినిధులు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఎస్.మారేశ్‌ను రాజ్యాంగ బద్ధమైన బీసీ కమిషన్ మెంబర్‌గా నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. మారేష్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి రాజ్యాంగ బద్ధమైన బీసీ కమిషన్ మెంబర్‌గా నియమించినందుకు జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ కమిషన్ ఔనత్యాన్ని మరింత పెంచేలా కమిషన్ పరిధి దాటకుండా బీసీల రిజర్వేషన్లు, బీసీల జీవన స్థితిగతులపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక ఇస్తానని తెలిపారు.

ఫిబ్రవరి 5, 6న పార్లమెంటు ముట్టడి...

ఆంధ్రప్రదేశ్‌లో కులగణన చేపట్టిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని... ఇదే విధంగా దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5, 6వ తేదీల్లో చలో పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. కుల గణనతో ఒక్కో కులం జనాభాతో పాటు సాంఘిక, ఆర్థిక, రాజకీయ వివరాలు సేకరించి వారి కులాలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లను అందించవచ్చునని అభిప్రాయపడ్డారు. అలాగే జనాభా ప్రకారం కులాల కార్పొరేషన్‌లకు ఫెడరేషన్‌లకు బడ్జెట్ కేటాయించి వారి ఆర్థిక అభివృద్ధికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. బీసీ కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించడానికి గ్రూపులుగా వర్గీకరించడానికి కులాల వారి జనాభా లెక్కలు ఉపయోగపడతాయన్నారు. చట్టబద్ధమైన కుల గణన వివరాలు లేక తాత్కాలికంగా ఎప్పటికప్పుడు వివరాలు సేకరించి లేదా లాటరీ పద్ధతిలో బీసీ స్థానాలు కేటాయిస్తున్నారని, ఏఏ స్థానాలకు ఎంత శాతం కేటాయించాలనే విషయంలో బీసీ జనాభా లెక్కలు లేక న్యాయపరమైన, చట్టపరమైన కోర్టు కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏపీని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవాలని ఆర్.కృష్ణయ్య కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, భూపేష్‌సాగర్, సి.రాజేందర్, రాజ్‌కుమార్, నందగోపాల్, గుజ్జ సత్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తయ్యేదెన్నడో..?

- అధికారులు, కాంట్రాక్టర్ మధ్య సమన్వయ లోపం
- ఇబ్బందుల్లో నింబోలిఅడ్డ ప్రజలు, వాహనదారులు



నింబోలిఅడ్డలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమ

కాచిగూడ: అధికారులు, కాంట్రాక్టర్ మధ్య సమన్వయ లోపం కారణంగా నింబోలిఅడ్డ ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని నెలల క్రితం ప్రారంభించిన డ్రైనేజీ పైపులైన్ పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేయడంతో స్థానికులు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ మధ్య సమన్వయ లోపంతోనే పనులు పూర్తి కావడం లేదని వారు మండిపడుతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు కేవలం ప్రారంభోత్సవాలకే పరిమితమవుతున్నాయి. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు, సిబ్బంది ఏమాత్రం పట్టించుకోకపోవడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయింది. నెలల తరబడి పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

కాచిగూడలో మూడు పార్టీల నేతల పెత్తనం

కాచిగూడ డివిజన్‌లో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధికారులపై పెత్తనం చెలాయిస్తుండడతో ఏం చేయాలో అర్థంకాక అధికారులు, సిబ్బంది మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో ఆ పార్టీ నాయకులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉండటంతో సదరు నేతలు, కార్యకర్తలు, స్థానికంగా బీజేపీ కార్పొరేటర్ ఉండడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఇలా ఎవరికి వారు తమ అధిపత్యాన్ని అధికారులపై చెలాయిస్తుండడంతో ఎటూపాలుపోని స్థితిలో అధికారులు ఉంటున్నారు. ఇదే అదనుగా భావించి కాంట్రాక్టర్లు ఇలా తమ ఇష్టానురీతిగా వ్యవహరిస్తూ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

డ్రైనేజీ పైపులైన్ పనులను పూర్తి చేయండి

నింబోలిఅడ్డ, లాల్ బహదూర్ స్కూల్ పక్కలేన్‌లో డ్రైనేజీ పైపులైన్ పనుల కోసం రోడ్డు తవ్వి వదిలివేయడంతో ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్ శనివారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. పనులు అసంపూర్తిగా ఉండడంతో అధికారుల నిర్లక్ష్యంపై కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులు పూర్తి చేయాలని, లేకుంటే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సన్యాసిరావు, ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ యాదవ్, బీజేపీ నేతలు మల్లికార్జున్, వెంకటేష్, బి.భీమ్‌రాజ్, రమాదేవి, రవియాదవ్, ఆర్.సంతోష్ పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను అభినందిస్తున్న హోంగార్డులు

కాచిగూడ: హోంగార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, ప్రతినిధులు గోపాల్ నాయక్, నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా హోంగార్డుల సమస్యలను కోదండరామ్‌కు వివరించారు.

పకడ్బందీగా ఓటరు జాబితా



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట్: ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతీ దివాకర్ అన్నారు. గసర్కిల్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఓటరు జాబితా సవరణ కొత్త జాబితా రూపొందించడం వంటి అంశాలపై శనివారం చర్చించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తప్పుల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీపీటీలో ఇద్దరికి అవార్డు



ఏపీ విశ్రాంత చీఫ్ సెక్రటరీ డాక్టర్ మోహన్ కందా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అమిత



మోహన్ కందా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సిద్ధార్థ

నల్లకుంట: విద్యానగర్ ఓయూ రోడ్డులో గల దుర్గాబాయి దేశ్ ఫిజియోథెరపీ కళాశాల (డీడీసీఓపీ)లో బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ) ఇంటర్న్‌లో అమిత, సిద్ధార్థ ప్రతిభ చూపి బెస్ట్ ఇంటర్న్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ విశ్రాంత ముఖ్య కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా వారికి మెడల్స్‌ను అందజేసి అభినందించారు. అలాగే కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు వారిని అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్‌లు ఐవైఆర్ కృష్ణారావు, ప్రభాకర్, డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఎన్. ఉషా రెడ్డి, డీడీసీఓపీ కార్యదర్శి లక్ష్మీసుందరి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఛాయా నందిని పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్



జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను శనివారం కలిసి డివిజన్ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. రాజా డీలక్స్ నుంచి దాయార మార్కెట్ వరకు కొత్తగా రోడ్డు వేయాలని, అలాగే బాకారం ధర్మాచరణ సమితి శ్మశానవాటికను కూడా అభివృద్ధి చేయాలని కోరానని ఆయన పేర్కొన్నారు.

బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఆర్.కృష్ణయ్యకు బాలరాముడి మహాప్రసాదాన్ని అందిస్తున్న పెరిక సురేశ్

అంబర్‌పేట్: రాబోయే లోకసభ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేలా అన్ని పార్టీలపై ఒత్తిడి చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్టలో 1008 దంపతులతో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శ్రీరామ హనుమాన్ మహాయజ్ఞంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా నేషనల్ సోషల్ మీడియా సభ్యుడు పెరిక సురేశ్ శనివారం ఆర్.కృష్ణయ్యను కలిసి మహా ప్రసాదం బాలరాముని ప్రతిమను అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గం



ఎస్.సూర్యప్రకాశ్

కాచిగూడ: తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షులుగా జి.రాంమోహన్ రెడ్డి, వివి చారి, కుమార్ దోసల, సరోజ్ బాల ఠాకూర్, ప్రధాన కార్యదర్శిగా జి.చంద్రమోహన్ గౌడ్, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, బి.వెంకటేశ్వర్లు, జి.శివకుమార్, డికె నాయక్, కోశాధికారిగా అటుకుల రాజు, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ వేముల నారాయణ, ఛత్రపతి శివాజీ, కె.కిషన్, ఎస్ఆర్ శ్రీనివాస్, ఆర్.సృజన కుమార్, బి.మాధవి, బి.నాగరాజు ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు.

కళా ప్రపంచం పుస్తకావిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కళాప్రపంచం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత ఎల్.ఆర్.వెంకటరమణ చిత్రకళ వ్యాసాల(కళా ప్రపంచం) పుస్తకాన్ని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాల పిట్ట బుక్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త రావురి సుభాష్‌బాబు మాట్లాడుతూ కలలు మన జీవితాలను ప్రతిబింబింపజేస్తాయన్నారు. డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త కె.ఆనందాచారి, డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, డాక్టర్ ఎస్.రఘు, కూరెళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



డాక్టర్ ఎస్.గౌతంరావును అభినందిస్తున్న కళాకారులు

కాచిగూడ: బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆయన రెండోసారి ఎన్నికైన సందర్భంగా కోవిద ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అనూహ్యా రెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో శనివారం ఆయనను కలిసి అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లోనూ మరోసారి బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాశ్ సింగ్, శ్యామ్‌రాజ్ సందీప్, దీపక్, చిట్టి శ్రీధర్, సూరయ్య గౌడ్ పాల్గొన్నారు.

పైపులైన్ పనుల ప్రారంభంపై హర్షం



అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న బీజేపీ నాయకుడు గౌరీశంకర్ తదితరులు

ముషీరాబాద్: చిలకలగూడ జలమండలి అధికారులకు బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. సికింద్రాబాద్ ఎంపీ కిషన్‌రెడ్డి వద్ద 2023 మార్చిలో రిప్రజెంటేషన్ లెటర్ తీసుకొని అడిక్‌మెట్ డివిజన్ మదర్స్ పబ్లిక్ స్కూల్ సమీపంలో స్ట్రీట్ నంబర్ 19లో డ్రైనేజీ పైపులైన్‌ను మార్చాలని కోరగా, జలమండలి అధికారులు ఆలస్యంగానైనా పనులు మొదలుపెట్టడం ఆనందంగా ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌరీశంకర్ అన్నారు. కార్యక్రమంలో మహంకాళీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు నరేశ్, కిశోర్, శాస్త్రి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మధు, కొండిన్య ప్రసాద్, దర్శన ర్సింగ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



జలమండలి అధికారులకు సమస్యను వివరిస్తున్న బీఆర్ఎస్ నేత శ్రీనివాస్

కాచిగూడ: గోల్నాక డివిజన్, నింబోలిఅడ్డ ఎస్సీ హాస్టల్ లేన్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ దూసరి లావణ్యా శ్రీనివాస్ గౌడ్ జలమండలి అధికారులను కోరారు. ఆ శాఖ అధికారులతో కలిసి బీఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్ గౌడ్ శనివారం ఎస్సీ హాస్టల్ లేన్ ప్రాంతాన్ని పరిశీలించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కేలండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి: జవహర్‌నగర్ లోని లలితా పరమేశ్వరీ ఆలయంలో కార్పొరేటర్ ఎ.పావని పద్మశాలీ సంఘం గాంధీనగర్ డివిజన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నేతలు ఎ.వినయ్‌కుమార్, ఆర్.శ్రీనివాస్, వెంకటేశ్ పయ్య, భిక్షపతి, వినోద్, అనిల్ కుమార్, ప్రభాకర్, నిరంజన్ పాల్గొన్నారు

గుండెపోటుతో వ్యాపారి మృతి

కాచిగూడ: హోటల్‌లో భోజనం చేసేందుకు వచ్చిన వ్యాపారి గుండెపోటుతో మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ మేఘన తెలిపిన వివరాల ప్రకారం.. బొగ్గులకుంట రాంకోఠి ప్రాంతానికి చెందిన రాసికలాల్ కిలోసియా (65) వృత్తిరీత్యా వ్యాపారి. శనివారం మధ్యాహ్నం కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలో గల వుడ్‌సైడ్ హోటల్‌లో భోజనం చేశాడు. అనంతరం బైక్ వద్దకు వెళ్తుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. గమనించిన హోటల్ నిర్వాహకాలు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. కిలోసియా గుండె జబ్బుతో బాధపడుతున్నట్లు అతని కుమారుడు తపన్ రాకిలలాల్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ముషీరాబాద్: ప్రగతిశీల ప్రజాస్వామ్యం విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) విద్యానగర్ ఏరియా నూతన కమిటీని మార్క్స్ భవన్‌లో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గౌతం, ప్రధాన కార్యదర్శిగా అసిఫ్, ఉపాధ్యక్షుడిగా సాయి, సహాయ కార్యదర్శిగా గణేశ్, కోశాధికారిగా ప్రవళిక, సభ్యులుగా గణేశ్, చరణ్, పవన్, శివల ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, ఉపాధ్యక్షుడు గడ్డం శ్యామ్‌ల కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీను, జిల్లా నాయకులు గణేశ్, పవన్, శ్రీకాంత్, మహేశ్, రాజు పాల్గొన్నారు.

అతివేగంతో అంతిమయాత్రకు దారి

ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్‌రాజు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

కవాడిగూడ: అతివేగంతో వాహనాన్ని నడిపితే ఒక్కోసారి అదే అంతిమయాత్రకు దారితీసుందని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట ఏసీపీ జి.శంకర్‌రాజు హెచ్చరించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా దోమలగూడలోని ఏవీ కళాశాలలో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట్, నెహ్రూ యువ కేంద్ర సంగతన్, తెలంగాణ యువజన వ్యవహారాలు క్రీడలు మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏవీ. కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ అండ్ కామర్స్, భారత్ సౌక్స్ అండ్ గైడ్స్ పాఠశాల సహకారంతో శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వేగం మజా ఇస్తుందని కానీ అది జీవితాన్ని కిల్ చేస్తుందని, అనేక కుటుంబాల్లో అతివేగమే విషాదాన్ని నింపిందని గుర్తుచేశారు. అతివేగం, ర్యాష్‌డ్రైవింగ్, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే జరిమానా తప్పదన్నారు. యువత మత్తు పదార్థాలు, మద్యానికి బానిసై ఉజ్వల భవిష్యత్‌ను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ చేయవద్దని, అది చట్టరీత్యా నేరం అని అన్నారు. అనంతరం కళాశాల నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఏవీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వద్మ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఎన్.వై.కె.ఎస్. జిల్లా యువజన అధికారి కుష్బుగుప్తా, ఇన్‌స్పెక్టర్ వి. రామచందర్, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, దోమలగూడ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, హీరోమోటార్ ప్రతినిధి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

అహంకార పూరిత మాటలు మానుకోవాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్ఎస్ నాయకులు అహంకార పూరిత మాటలు మానుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ హెచ్చరించారు. బాగ్‌లింగంపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కరీంనగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడిన తీరు సరైంది కాదన్నారు. బీసీ మంత్రితో పాటు బీసీ, ఎస్సీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలను బట్టలు విప్పుతా అనడం ఎంత వరకు సమంజసం ప్రశ్నించారు. కాంగ్రెస్ శ్రేణులు తలచుకుంటే మీరు తెలంగాణలో తిరగగలరా ఆలోచించుకోండి అని హెచ్చరించారు. ఇప్పటికైనా అబద్ధపు మాటలు మాని కాంగ్రెస్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆపాలన్నారు. గతంలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అప్రజాస్వామికంగా మీ పార్టీలో కలుపుకోని ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేసిన మీరు చౌకబారు మాటలు మాట్లడడం సిగ్గుచేటు అని మండిపడ్డారు.

సామాజిక న్యాయం పాటించాలి

కాచిగూడ: హైకోర్టులో త్వరలో ప్రకటించే నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలని గుండ్రాతి శారదాగౌడ్ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న నియామకాలపై ఆమె అసంతృప్తిని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు ఇచ్చిన కీలక నియామకాల భర్తీ చూస్తే రెడ్డిలకే ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు.

స్కూల్ బ్యాగుల అందజేత



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న ఎస్‌జీబీఎస్‌ఎస్ ప్రతినిధులు

నల్లకుంట: సంత్ గాడ్గేబాబా భారత సేవా సమితి, యూత్ ఫర్ సేవా సంయుక్త ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్ పరిధిలోని సత్యానగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్‌జీబీబీఎస్ఎస్ ఫ్రీ స్కూల్‌కు చెందిన సుమారు 65 మంది ఉపాధ్యాయులు, విద్యార్థులకు యూత్ ఫర్ సేవా స్కూల్ బ్యాగ్‌లను శనివారం అందించారు. కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ సునీల్, ఎన్జీవోస్ కో–ఆర్డినేటర్ చరణ్, హిందూ వాహినీ కార్యాలయం ప్రముఖ్ రాకేశ్, మోహన్, సంస్థ సభ్యులు సర్దార్ అశోక్ కిశోర్ కుమార్, ప్రమోద్ కుమార్, ఆనంద్, సాయి కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కాచిగూడ: కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వివిల్ చారి తెలిపిన వివరాల ప్రకారం.. మహిళ (35) శివరాంపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నంబర్ 1, రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జికి దుప్పటితో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతిరాలి ఒంటిపై లైట్ పింక్ చుడిదార్, బ్లాక్ లెగ్గింగ్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుల గణనతోనే సామాజిక న్యాయం



జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్‌కు వినతి పత్రం ఇస్తున్న కుమారస్వామి

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: అసమానతలు లేని సమాజం కోసం కులగణన చేపట్టాలని, దానిద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కోరారు. నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారామ్ నగరానికి వచ్చిన సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ప్రతినిధులు శనివారం ఆయనను కలిసి బీసీల సమస్యలను వివరించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు బీసీ కులాలు ఓబీసీ జాబితాలో లేకపోవడం వల్ల ఆయా వర్గాలకు చెందిన పేద విద్యార్థులు జాతీయ స్థాయిలో విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్లు కోల్పోతున్నారన్నారు. జాతీయ బీసీ కమిషన్ కులాలపై, రాష్ట్రాల్లోని స్థితిగతులపై లోతుగా అధ్యయనం చేయాలని కోరారు. తెలంగాణలో బీసీ కులాలుగా గుర్తింపున్న వాటిని పరిశీలించి రిజర్వేషన్లు వర్గీకరణ చేస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో అగ్రవర్ణాల్లోని కులాలకే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు దక్కుతున్నాయని, బీసీలకు మాత్రం సమాన అవకాశాలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. దేశంలో జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 27 నుంచి 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ దళ్ నేతలు సాయి యాదవ్, రాజేశ్ పాల్గొన్నారు.

మహిళను ఇంటికి చేర్చిన పోలీసులు

చిక్కడపల్లి: ఇంటికి వెళ్లేందుకు దారి తెలియని మహిళను చిక్కడపల్లి పోలీసులు స్వగ్రామానికి చేర్చారు. స్టేషన్ పరిధిలో ఒంటరిగా తిరుగుతుండగా పెట్రోలింగ్ సిబ్బంది గమనించి స్టేషన్‌కి తీసుకువచ్చారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ.సీతయ్య ఆమెను విచారించగా వివరాలు సరిగా చెప్పలేదు. దీంతో ఆమెను బోయిగూడలోని హోమ్‌నందు చేర్పించారు. తర్వాత ఎస్‌హెచ్ఓ ఆమె ఆచూకీ వివరాలు సేకరించగా, ఉమ్మెత్తల అరుణమ్మ (34) స్వస్థలం నల్గొండ జిల్లా షాబాద్ అని తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు హైదరాబాద్ వరకు రాలేమని చెప్పడంతో ఎస్‌హెచ్ఓ సీతయ్య చొరవ తీసుకొని సొంత వాహనంలో మహిళా సిబ్బందిని రక్షణగా ఇచ్చి శుక్రవారం క్షేమంగా సొంత గ్రామానికి తీసుకెళ్లారు.

ఓయూ వీసీ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్ దిష్టిబొమ్మను శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఓయూ హాస్టల్ విద్యార్థినులకు రక్షణ కరువైందన్నారు. గత నెల లేడీస్ హాస్టల్‌లోకి, ఈ నెల 26న సికింద్రాబాద్ పీజీ కాలేజీ లేడీస్ హాస్టల్‌లోకి ఆగంతకులు చొరబడి విద్యార్థినులను భయాభ్రాంతులకు గురి చేశారని పేర్కొన్నారు. వీసీ పాలన భవనం చుట్టూ ముళ్ల కంచెతో భద్రత వలయాన్ని నిర్మించుకొని విద్యార్థినులను రక్షణపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే వీసీ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383